ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

మంగళవారం 2 జనవరి 2024

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు 8లో..

8లో.. గడప గడపకూ శ్రీరాముని అక్షింతలు

అత్యధికులు రేషన్‌కార్డుకే..

ప్రజాపాలనలో అర్జీల వెల్లువ



- కొన్ని చోట్ల ఫారాలకు ఇబ్బంది
- అవగాహన లేక... జేబులకు చిల్లు
- జిల్లాలో మూడు రోజుల్లో 1.30 లక్షలకు పైగా దరఖాస్తులు
- ఈ నెల 6వ తేదీ వరకు ప్రజాపాలన
- తదుపరి సైతం యథాతదంగా దరఖాస్తుల స్వీకరణ

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమంలో అత్యధికంగా ముమ్మరంగా దరఖాస్తులు వస్తున్నాయి. ఇందులో అత్యధికంగా రేషన్ కార్డులు, పాత కార్డులలో మార్పులు, చేర్పులు కోరుతూ అర్జీలు వస్తుండడం విశేషం. ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకాల అమల్లో భాగంగా జిల్లాలో ప్రజా పాలన కార్యక్రమాన్ని అధికారులు విస్తృతంగా నిర్వహిస్తున్నారు. గత నెల 31వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు పల్లెలు, పట్టణాల్లో సభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ జరుగుతోంది. తదుపరి సైతం యథాతదంగా దరఖాస్తులు స్వీకరిస్తామని, అభయహస్తం నిరంతరం జరిగే ప్రక్రియ అని అంటున్నారు. ఇందుకోసం ప్రభుత్వమే పథకాల వివరాలతో ప్రజా పాలన పేరిట ఫారం రూపొందించి అందిస్తోంది. గత నెల 31వ తేదీ, ఈనెల 1వ తేదీలలో సెలవుల కారణంగా దరఖాస్తుల స్వీకరణ జరగలేదు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన కార్యక్ర మంలో సుమారు 1.30 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి.

జిల్లా వ్యాప్తంగా వెల్లువలా..

జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో 1,36,492 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాలలో 1,18,142, పట్టణ ప్రాంతాల్లో 1,36,492 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. అభయహస్తం ఆరు గ్యారెంటీలకు 1,18,142 దరఖాస్తులు రాగా ఇందులో 1,01,501 గ్రామీణ ప్రాంతాల్లో, 16,641 దరఖాస్తులు పట్టణ ప్రాంతాల్లో వచ్చాయి.

రేషన్ కార్డు, భూమి, ఇతర సమస్యలపై 18,246 దరఖాస్తులు రాగా 16,973 గ్రామీణ ప్రాంతాల్లో, 1,273 పట్టణ ప్రాంతాల్లో వచ్చాయి. జిల్లా వ్యాప్తంగా వచ్చిన వాటిల్లో రేషన్ కార్డు సమస్యతో కూడిన దరఖాస్తులు 1,09,430 ఉండగా రేషన్ కార్డు సమస్య లేకుండా వచ్చిన దరఖాస్తులు కేవలం 8,712 మాత్రమే ఉన్నాయి.

మండలాల వారీగా ఇలా..

బీర్‌పూర్ మండలంలో 2,465 దరఖాస్తులు, బుగ్గారంలో 3,760, ధర్మపురి 5,524, గొల్లపల్లి 6,382, ఇబ్రహీంపట్నం 6,306, జగిత్యాల 2,026, జగిత్యాల రూరల్ 7,322, కథలాపూర్ 8,559, కోరుట్ల 3,061, మల్లాపూర్ 6,500, మల్యాల 6,077, మేడిపల్లి 8,099, మెట్‌పల్లి 6,586, పెగడపల్లి 4,772 దరఖాస్తులు వచ్చాయి. రాయికల్ 5,277, సారంగపూర్ 5,111, వెల్గటూరు 8,062 దరఖాస్తులు వచ్చాయి. ధర్మపురి మున్సిపాలిటీలో 883, కోరుట్ల పట్టణంలో 4,428, మెట్‌పల్లిలో 2,886, రాయికల్‌లో 1,036 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

ఫారాలకు ఇబ్బంది..

అభయహస్తం - ప్రజాపాలన పేరిట సంక్షేమ పథకాల లబ్ధికోసం దరఖాస్తు ఫారాన్ని ప్రభుత్వమే ముద్రించిన విషయం తెలిసిందే. వీటిని అందరికీ ఉచితంగా అందిస్తామని కొరత లేదని అధికారులు ప్రకటించారు. కానీ కొన్నిచోట్ల సిబ్బంది తమ గ్రామానికి కొన్ని ఫారాలే వచ్చాయంటూ ఒక్కోటి మాత్రమే ఇచ్చారు. ఈ సందర్భంలో పెద్ద కుటుంబాల్లో ఒకరికి మించి దరఖాస్తు చేయాలంటే ఇబ్బందులు ఎదురవు తున్నాయి. మరో దరఖాస్తు ఫారం ఇవ్వకపోవటంతో వీరంతా జిరాక్స్‌లు తీసుకుంటున్నారు. ఇక జిరాక్స్‌లతో దరఖాస్తు చేస్తే అంగీకరిస్తారా....లేదా అంటూ కొందరు అయోమయానికి గురవుతున్నారు.

అవగాహన లేక జేబులకు చిల్లు

దరఖాస్తు ఫారానికి రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు మాత్రమే జత చేయాలని అధికారులు సూచించారు. రేషన్ కార్డు లేకుంటే ఆధార్ పత్రం సరిపోతుందని అంటున్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో కరెంటు బి ల్లు, గ్యాస్ బుక్ వంటి వాటి జిరాక్స్ కాపీలు కూడా జత చేస్తున్నారు. దీంతో వాటికీ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఆధార్ కార్డులో చిరునామా మరోచోట ఉందని ఫొటో నవీకరణ చేసుకోవాలని కొందరు తప్పుదోవ పట్టిస్తున్నారు. దీంతో మీ సేవ సెంటర్ల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ప్రస్తుతానికి అవేమి లేకున్నా ఉన్న ఆధార్ పత్రం జిరాక్స్ కాపీతో దరఖాస్తు చేస్తే సరిపోతుందని అధికారులు చెబుతున్నారు.

కొంత అయోమయం...

ప్రభుత్వమే రూపొందించి ఇచ్చిన దరఖాస్తు ఫారం నింపే విషయంలో కొందరు కొంత అయోమయానికి గురవుతున్నారు మహాలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసే సమయంలో కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది మహిళలు ఉండి, వారి పేర్లు ఒకే రేషన్ కార్డులో ఉండటంతో ఒకే దరఖాస్తులో వివరాలు రాయాలా... వేర్వేరు అందించాలా అని తికమక పడుతున్నారు. ఒకటి కంటే ఎక్కువ పథకాలను ఒకే కుటుంబంలో పొందాల్సి వచ్చిన సందర్భంలో ఎవరి ఫొటో అతికించాలనే విషయంలోనూ సందిగ్ధత ఎదురవుతోంది. రైతు భరోసా కింద కౌలు రైతులు దరఖాస్తు చేసినప్పటికీ సంబంధిత ఫారంలో భూ యజమాని పట్టా పాసు పుస్తకం వివరాలు అందించలేకపో తున్నారు. విద్యుత్ సబ్ మీటర్ లేకుండా అద్దె ఇళ్లలో ఉన్న వారు గృహజ్యోతికి దరఖాస్తు చేసే సందర్భంలో సర్వీసు నంబరు లేకుండా దరఖాస్తు సమర్పించాల్సి వస్తోంది. గ్రామసభల్లో పాల్గొన్న అధికారులు సైతం వీరి సం దేహాలను కొంత వరకే నివృత్తి చేస్తున్నారు. దరఖాస్తుకు సంబంధిత వివరాలు, పత్రాలు జత చేయకున్నా తీసుకుంటున్నారు. ఇలాంటి దరఖాస్తుల వి షయంలో రానున్న రోజుల్లో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని అధికా రులు చెపుతున్నారు. తెల్ల కాగితంపై రేషన్ కార్డులు, భూమి సమస్యలపై వచ్చే ఆర్జీలను సంబంధిత శాఖల ఉన్నతాధికారులకు పంపుతామని అధికారులు అంటున్నారు.

తెల్ల కాగితంతో వినతి పత్రాలు..

పథకాల లబ్ధికి తెల్ల రేషన్ కార్డు ప్రాతిపాదిక అని చెబుతుండటంతో లేని వారు కార్డు కోసం తెల్లకాగితంపై దరఖాస్తు చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పుట్టింటి వద్ద రేషన్‌కార్డులో ఉండి వివాహమైన మహిళలకు అత్తింటి వద్ద పేరు లేకపోవటంతో మహాలక్ష్మి పథకానికి ఎలా దరఖాస్తు చేయాలని ఎక్కువగా అడుగుతున్నారు. తాము పేదలమని, కానీ కార్డు లేదని చెప్పటంతో వారి నుంచి ప్రజా పాలన దరఖాస్తు తీసుకోవటంతో పాటు రేషన్ కార్డు కోసం వేరుగా తెల్ల కాగితంపై రాసిన వినతి పత్రాలు స్వీకరిస్తున్నారు. ఇందుకోసం సభలు జరుగుతున్న చోట ప్రత్యేకంగా మరో కౌంటర్‌లను సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఇదే కౌంటర్‌లో వ్యక్తిగత, సామాజిక సమస్యలపైన వినతి పత్రాలు తీసుకుంటున్నారు. సంక్షేమ పథకాల దరఖాస్తు ముట్టినట్లుగా రసీదు ఇవ్వటంతో పాటు నోటుబుక్‌లో దరఖాస్తుదారు వివరాలు రాసుకుంటున్నారు. కానీ తెల్లకాగితంపై రాసిచ్చే వినతి పత్రాలకు ఎలాంటి రసీదు ఇవ్వటం లేదు.

ఇతర సమస్యలకు లెక్క...

సంక్షేమ పథకాల దరఖాస్తు ఫారాలతో పాటు వ్యక్తిగత సామాజిక సమస్యలపై ఫిర్యాదులు తీసుకుంటున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ కౌంటర్‌ను ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నారు. తెల్ల కాగితం పై రాసిచ్చిన వినతులను ఇక్కడ తీసుకుంటున్నప్పటికీ వీటికి సంబంధించిన రశీదులు ఇవ్వడం, నోటుబుక్‌లలో నమోదు చేయడం జరగడం లేదు. దీంతో తమ దరఖాస్తుకు ఆధారం లేకుండా పోతోందన్న బెంగ నెలకొంది. అయితే ఏ రోజు ఎన్ని ఇతర దరఖాస్తులు వచ్చాయన్న విషయాన్ని అధికారులు లెక్కిస్తున్నారు. ఏఏ గ్రామంలో ఎన్ని ఇతర దరఖాస్తులు వచ్చాయో ప్రకటిస్తున్నారు. దీంతో ఇతర సమస్యల దరఖాస్తు దారులకు సైతం కొంత ఊరట లభిస్తోంది.

నేరాల నియంత్రణపై దృష్టి సారించాలి

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



కేక్ కట్ చేస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేర శాతం నియంత్రణపై పోలీసు అధికారులు దృష్టి సారించాలని ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ సూచించారు. సోమవారం పట్టణంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక సమావేశాన్ని జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. గడిచిన సంవత్సరం పోలీసు శాఖలో ఎన్నో నూతన ఒడవడికలను, అధునాతన సాంకేతికతను అందించామన్నారు. నూతన సంవత్సరంలోనూ అదే శైలిలో విధులు నిర్వర్తిస్తూ బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అవలంబిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలన్నారు. అన్ని విభాగాల్లో అన్ని స్థాయిల్లో అధికారులు, సిబ్బంది ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో కృషి చేసిన పోలీసు అధికారులను అభినందించారు. రాబోయే ఎన్నికలకు సైతం అధికారులు, సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని సూచించారు. జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు వెంకటస్వామి, రవీందర్ రెడ్డిలతో పాటు పలువురు సీఐలు, ఎస్ఐలు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌కు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బీమ్‌రావు, జనార్దన్ రెడ్డి, డీఎస్పీలు రవీంద్రకుమార్, వెంకటస్వామి, సురేశ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వర్‌రావు, ఆర్ఐలు జానిమియా, రామకృష్ణ, వేణు, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం

ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

పెగడపల్లి, జనవరి 1 : ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ప్రతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం పక్కాగా అమలు చేస్తుందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బతికెపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాలతో కలసి జీవన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలు, స్థానికత ఆధారంగా ఉద్యమం సాగిందని ఉద్యమ నాయకుడిగా కేసీఆర్‌కు రెండు పర్యాయాలు అధికారం ఇస్తే ఉద్యమ లక్ష్యాలు నీరుగారేలా నిర్వీర్యం చేశారన్నారు. తెలంగాణ ఏర్పాటుతో రాజకీయంగా పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా యువత బలిదానాలకు ముగింపు పలకాలని తల్లి సోనియమ్మ తెలంగాణ ప్రకటించిందన్నారు. సంక్షేమ ఫలాలు పొందడం ప్రజల హక్కని, ప్రజలు మార్పు కోరి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని గత ప్రభుత్వ పాలనకు మించి సంక్షేమ ఫలాలు అమలు చేసి రాష్ట్ర ప్రజలకు మేలు చేసేందుకు రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బతికెపల్లి నుంచి తన రాజకీయ ప్రజా జీవితం ప్రారంభించానని పుట్టిన ఊరుకు రుణపడి ఉంటానని తెలిపారు. ఇక నుంచి బతికెపల్లితో పాటు పెగడపల్లి మండలాభివృద్ధి విప్ లక్ష్మణ్ కుమార్‌పై బాధ్యత ఉంటుందన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా కృషి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానన్నారు. ప్రభుత్వ పరంగా అందించే సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హులందరికీ అందేలా కృషి చేస్తానన్నారు. ఆరు గ్యారంటీల ఎంపిక పారదర్శకతతో జరుగుతుందని ఇందులో ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దన్నారు. సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక నిరంతరం కొనసాగుతుందన్నారు. జనవరి ఆరు తరవాత కూడా దరఖాస్తు చేసు కోవచ్చన్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ ప్రజాపాలనలో అందించే దరఖాస్తులను ప్రజలు కొనుగోలు చేయొద్దని వాటిని ప్రభుత్వమే ఉచితంగా అందజేస్తుందన్నారు. పెన్షన్, రైతు బంధు పొందుతున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటిపర్తి శోభారాణి, జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, ఎంపీపీ గోళి శోభ, ఎంపీటీసీలు అనసూర్య, లచ్చయ్య, ఎంపీడీవో పుల్లయ్య, తహసీల్దార్ ఫారూక్, ఎంపీవో మహేందర్, వార్డు సభ్యులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

వెలమ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): పోటీ తత్వాన్ని ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని జగిత్యాల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యాచమనేని వెంకటేశ్వర్ రావు, దన్నపునేని వేణుగోపాల్ రావులు అన్నారు. సోమవారం పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో సంక్రాంతి పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించారు. మూడు కేటగిరిల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్ విభాగాల్లో పోటీ పడిన పలువురు మహిళలకు బహుమతులు, కన్సోలేషన్ బహుమతులు అందించారు. సంస్కృతి సంప్రదాయాలకు ముగ్గుల పోటీలు అద్దం పడుతాయన్నారు. సంఘం మహిళా విభాగం నాయకులు రాధిక, శిరీషా, హరిప్రియ పాల్గొన్నారు.










స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా రాజు

ఎల్లారెడ్డిపేట, జనవరి 1: స్వేరో నెట్‌వర్క్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎల్లా రెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామానికి చెందిన మారుపాక రాజు సోమవారం నియమితులయ్యారు. జిల్లాలో స్వేరోలను పటిష్టపర్చడంతో రాజు కీలకపాత్ర పోషించారు. ఈ సందర్భంగా రాజు స్వేరో నెట్‌వర్క్‌లోని అన్ని అనుబంధ సంఘాలను కలిపి ఒక సంఘంగా ఏర్పాటు చేశారని తెలిపారు. తన నియామకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.









పోలీసు సేవా పతకాలకు పలువురి ఎంపిక

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు సేవా పతకానికి జగిత్యాల జిల్లా నుంచి ఆరుగురు పోలీసు అధికారులు, ఉద్యోగులు ఎంపిక య్యారు. సోమ వారం రాష్ట్ర హోం శాఖ ప్రకటించిన సేవా పతకాలకు జగిత్యాల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ మహ్మద్ సామ్ దానీ, మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్ఐ శ్రీపెరంబదూరు ఆంజనేయులు, జగిత్యాల దరూర్ క్యాంపు లో పనిచేస్తున్న ఏఆర్ ఎస్ఐ వెన్నంపల్లి రవీందర్, కోరుట్ల అటాచ్డ్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అవుదుర్తి తిరుపతి, వెల్గటూరు హెడ్ కానిస్టేబుల్ అత్రం బహదూర్ షా ఎంపికయ్యారు. మెట్‌పల్లి ఫైర్ స్టేషన్‌లో లీడింగ్ ఫైర్‌మెన్‌గా పనిచేస్తున్న ఆంజనేయులు స్టేట్ ఫైర్ సర్వీస్ ఉత్తమ సేవా పతకానికి ఎంపికయ్యారు.

● రాజన్న సిరిసిల్ల జిల్లాలో..

సిరిసిల్ల క్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లాలో నలుగురు పోలీసు అధికారులు, ఒక ఫైర్ అధికారి పోలీస్ ఉత్తమ సేవా పతకాలకు ఎంపికయ్యారు. జిల్లాలో పోలీసుశాఖలో పని చేస్తున్న పున్నం మహేందర్‌రెడ్డి (ఏఆర్ ఎస్ఐ), ఎం రాజ్‌కుమార్ (ఏఆర్ హెచ్‌సీ), గొంటి ప్రభాకర్ (రుద్రంగి హెడ్ కానిస్టేబుల్), గోనె తిరుపతి (ఏఆర్ హెచ్‌సీ), కె మహేం ద్రాచారి (ఫైర్‌మెన్, వేములవాడ) సేవా పతకాలకు ఎంపికయ్యారు.

● రామగుండం కమిషనరేట్‌లో..

కోల్‌సిటీ: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఆరుగురికి పోలీస్ సేవా పతకాలు లభించాయి. ఏఆర్ఎస్ఐ కాంపెల్లి లింగయ్య, మంచిర్యాల ట్రాఫి క్ ఎస్ఐ నీరటి రామరాజు, తాళ్లగురిజాల ఏఎస్ఐ మామిడి రాజన్న, పెద్దపల్లి ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ నీర్ల వేణుగోపాల్, లక్సెట్టిపేట హెడ్ కానిస్టేబుల్ ఇష్తాకర్ అహ్మద్, దండేపల్లి హెడ్ కానిస్టేబుల్ అజ్మీరా గంగ్యా నాయక్‌లు పతకాలకు ఎంపికయ్యారు.

రేపు కరీంనగర్ జోన్ సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 1: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 3న ఉదయం 9 గంటలకు నగునూరులోని గ్రామీణ క్రీడా ప్రాంగణంలో కరీంనగర్ జోన్ స్థాయి అండర్-14 బాలబాలికలకు సాఫ్ట్‌బాల్ ఎంపిక పోటీల ను నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పోతన శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు ఫొటోపై హెడ్‌మాస్టర్ సంతకం చేసిన ఎలి జిబులిటీ ఫాం, స్టడీ సర్టిఫికెట్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్ తో హాజరు కావాలని సూచించారు.

రేపు కట్కాపూర్‌కు కేంద్ర బృందం రాక

రాయికల్, జనవరి 1: మండలంలోని కట్కాపూర్ పల్లె దవాఖానాను ఈ నెల 3న కేంద్ర బృందం పరిశీలించనున్నట్లు జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన (ఎన్‌క్వాస్)లో భాగంగా బృందం పరిశీలించి ఏడు విభాగాల్లో అందుతున్న సేవలను, రికార్డులను పరిశీలిస్తారని చెప్పారు. ఆయా విభాగంలో ఉన్నత మార్కులు సాధిస్తే యేటా మూడేళ్ల పాటు నిధులు మంజూరవుతాయన్నారు. జాతీయ గుర్తింపు పొందడానికి పల్లె దవాఖానాను సిద్ధం చేశామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

జగిత్యాల రూరల్, జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆల యంలో పూజలు చేయడానికి స్కూటీ పై వెళ్తున్న మహిళను మృత్యువు కబళిం చింది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల పట్టణంలోని మహాలక్ష్మీనగర్‌కు చెందిన సామ సుజాత (42) తన స్కూటీ పై జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస ఆలయంలో పూజలు చేయడానికి బయ ల్దేరింది. పొలాస వద్ద గల ఆలయ కమాన్ సమీపంలో ధర్మపురి వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు సుజాతను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సుజాత తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందింది. అక్కడే ఉన్న స్థానికులు సుజాతకు సీపీఆర్ చేసినా ఫలితం లేకుండాపోయింది. మృతదేహాన్ని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. సుజాతకు కూతురు ఉంది. సుజాత భర్త హేమేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మహాలక్ష్మి స్కీంపై ఆర్టీసీ సిబ్బందికి సూచనలు

భగత్‌నగర్, జనవరి 1: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ జోన్ ఈడీసోమవారం మహాలక్ష్మి స్కీంపై సిబ్బందికి సూచనలు అందజేశారు. కరీంనగర్ బస్‌స్టేషన్‌లో ఆవరణలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేక్ కట్ చేసి ఆర్టీసీ సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) ఎస్ భూపతిరెడ్డి, డిప్యూటి రీజినల్ మేనేజర్ (మెకానిక్) ఎం సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ ఎంచంద్రయ్య, అకౌంట్స్ ఆఫీసర్ సిహెచ్ వెంకటేశ్వర్లు, బస్టాండ్ ఎంటీఎం రజనీకృష్ణ, కరీంనగర్-1, 2 డిపో మేనేజర్లు ఎల్ మల్లేశం, వి మల్లయ్య, ఏటీఎం కార్గో ఎస్ సదాశివ, బస్టాండ్ అసిస్టెంట్ మేనేజర్ అంజయ్య పాల్గొన్నారు.

కిందపడి గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

కరీంనగర్ క్రైం, జనవరి 1: కరీంనగర్ కట్టరాంపూర్‌లోని ఒక అపార్ట్ మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న గొర్రె లక్ష్మీరాజం(55) కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. అతడు చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడని ఒకటో ఠాణా పోలీసులు తెలిపారు. కిసాన్‌నగర్‌కు చెందిన లక్ష్మీరాజం కట్టరాంపూర్‌లోని అపార్ట్‌మెంట్‌లో వాచ్ మన్‌గా ప ని చేస్తున్నాడు. డిసెంబరు 29న మధ్యాహ్నం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ఆంజనేయులుకు చెందిన ఆవుదూడ బయటకు పరుగెడుతుం డగా అడ్డుగా పోయి తాడు కాళ్లకు తట్టుకుని కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబసభ్యులు హైదరాబాద్ నిమ్స్‌కు తర లించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. దూడ యజమాని ఆంజనేయులుపై చర్యలు తీసుకోవాలని మృతుడి భార్య కనకతార పోలీసులకు ఫిర్యాదు చేశారు.



మానేరులో చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి


దాసరి శ్రావణ్(ఫైల్)

గన్నేరువరం, జనవరి 1: లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ చందా నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన దాసరి శ్రావణ్(22) సోమవారం ఉదయం లోయర్ మానేరు డ్యాంలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. రోజు లాగే శ్రావణ్ ఉదయం 6గంటలకు బైక్‌పై చేపల వేటకు డ్యాంకు వెళ్లి మధ్యాహ్నం అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో తండ్రి వెంకటయ్య మరికొంత మందితో కలిసి తెప్పలపై మానేరు నీటిలో వెతకడంతో యువకుడి మృతదేహం లభ్యమైంది. తండ్రి వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నూతన సంవత్సరం రోజే యువకుడు మృతి చెందడం గ్రామంలో విషాదం నింపింది. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

● మల్యాల యువకుడి మృతి


అరుణ్‌కుమార్(ఫైల్)

చందుర్తి, జనవరి 1: హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండలం మల్యాల గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. గ్రామస్థుల కథనం ప్రకారం.. మల్యాలకు చెందిన నేదూరి అరుణ్‌కుమార్ (28) అనే యువకుడు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో పాల వ్యాపారం చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున తన ద్విచక్రవాహనంపై పాలను సరఫరా చేసేందుకు వెళ్తున్నాడు. మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కొన్ని సంవత్సరాల క్రితం గ్రామానికి చెందిన అనూష అనే యువతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. అరుణ్‌కుమార్‌కు తల్లిదండ్రులు చంద్రయ్య, లక్ష్మీనర్సవ్వ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మత్స్యకారుడి మృతి

ఇల్లంతకుంట, జనవరి 1: మండలంలోని రంగపేట గ్రామానికి చెందిన ఎలవేని పర్శరాం (55) అనే మత్స్యకారుడు సోమవారం రోడ్డుప్రమాదంలో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. పర్శరాం సోమవారం ఉదయం చేపలు పట్టడానికి ద్విచక్రవాహనంపై మధ్యమానేరుకు బయల్దేరాడు. వల్లంపట్ల గ్రామసమీపంలో ప్రమదవశాత్తు వాహనం పైనుంచి రోడ్డు పక్కన ఉన్న బురదలో పడి మృతిచెందాడు. బంధువుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

పెద్దపల్లి రూరల్, జనవరి 1: మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన అర్నకొండ మల్లమ్మ (80) అనే వృద్ధురాలు గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందింది. పోలీసులు, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు హన్మంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ మహేందర్ తెలిపారు.

రాజన్న సేవలో ప్రముఖులు


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ, జనవరి 1 : వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం, ఆలయ పర్యవేక్షకుడు తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు. ఇదిలా ఉండగా రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కొత్త ఇన్నోవా వాహనానికి రాజన్న సన్నిధిలో సోమవారం సాయంత్రం ఆది శ్రీనివాస్ పూజలు నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వామివారిని దర్శించుకొని కోడె మొక్కు చెల్లించుకున్నారు.

రాజన్న సేవలో జడ్పీ చైర్ పర్సన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని జిల్లా పరిషత్ అధ్యక్షురాలు న్యాలకొండ అరుణ సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అర్చకులు ఆశీర్వచనం గావించారు.

రాజన్న సేవలో ఎన్నికల పరిశీలకుడు

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్నికల పరిశీలకుడు మణిగండ స్వామి వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆశీర్వచనం, స్వామివారి ప్రసాదం అందజేశారు.

రాజస్థాన్‌లో ఆర్మీ జవాన్ మృతి

● జగ్గారావుపల్లిలో విషాదం


శివకుమార్ (ఫైల్)

బోయినపల్లి, జనవరి 1: బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ చాడ శివకుమార్ (23) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. శివకుమార్ సీఐఎస్ఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్నాడు. బంధువులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శివకుమార్ రెండేళ్ల క్రితం సీఐఎస్ఎఫ్‌లో ఉద్యోగం పొందాడు. రాజస్థాన్‌లోని డిలోలిలో 16వ బెటాలియన్‌లో డాక్యుమెంటరీ సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తుండగా డిసెంబరు 16న బాత్ రూమ్‌లో జారీ కిందపడ్డాడు. తలకు గాయమై కోమాలోకి వెళ్లాడు. తోటి సిబ్బంది జైపూర్‌లోని ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శివకుమార్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దసరా పండుగ సందర్భంగా స్వగ్రామానికి వచ్చిన శివకుమార్ అనంతరం తిరిగి విధులకు వెళ్లాడు. ఇటీవల తెలంగాణలో నిర్వహించిన కానిస్టేబుల్ పరీక్షల్లో ఏఆర్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. శిక్షణకు సమయం ఉండడంతో తిరిగి రాజస్థాన్ వెళ్లి విధుల్లో చేరాడు. శివకుమార్ తల్లిదండ్రులు ఇద్దరు గోపాల్‌రెడ్డి భాగ్యమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సోదరుడు గంగారెడ్డి సిరిసిల్లలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. శివకుమార్ మృతితో గ్రామంలో విషాదం చోటుచేసుకుంది.

ప్రమాదకరంగా రహదారి

● వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరి మృతి
● కనిపించని హెచ్చరిక బోర్డులు

హుజూరాబాద్ రూరల్, జనవరి 1: హుజూరాబాద్ మండలం మీదుగా వెళ్తున్న ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారుతోంది. వారం వ్యవధిలో వాహనాలు ఢీకొని ఇద్దరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మండలంలోని తుమ్మనపల్లి శివారులో డిసెంబరు 27న సింగాపూర్ గ్రామానికి చెందిన గాడి అనిల్‌రెడ్డి(29) స్వగ్రామానికి వరంగల్-కరీంనగర్ ప్రధాన రహదారిపై వస్తున్న క్రమంలో ఓ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. డిసెంబరు 28న అర్ధరాత్రి జాతీయ రహదారి పనుల్లో కూలీ పనిచేస్తున్న వినోద్ కోలే(29) తన స్నేహితుడితో కలిసి ద్విచక్ర వాహనంపై పనినిమిత్తం బయటికి వెళ్లి తిరిగి సింగాపూర్‌కు వెళ్తున్న క్రమంలోనే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో వినోద్ కోలే అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని తుమ్మనపల్లి, సింగాపూర్ గ్రామాల సమీపంలో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. జమ్మి కుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై శాలపల్లి-ఇందిరానగర్, చెల్పూర్, రంగాపూర్, సిర్సపల్లి, పర్కాల్ క్రాస్, కందుగుల, దమ్మక్కపేట క్రాస్‌లు డేంజర్ స్పాట్‌గా మారాయి.


రంగాపూర్‌లో జమ్మికుంట-హుజూరాబాద్ రహదారిపై ప్రమాద దృశ్యం(ఫైల్)

రక్షణ చర్యలు చేపట్టాలి
- బాషవేణి రాజేష్‌యాదవ్, సింగాపూర్



సింగాపూర్ శివారులో రాత్రి పూట ప్రధాన రహదారిపై బైక్‌తో వెళ్లాలంటే భయపడుతున్నాం. భారీ వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. డేంజర్ స్పాట్‌ల వద్ద అధికారులు రక్షణ చర్యలు చేపట్టాలి.

వాహనదారులు నిబంధనలను పాటించాలి
-సిరాజ్ ఉర్ రహమాన్, ఎంవీఐ, హుజూరాబాద్



ప్రతి వాహనదారుడు నియమ నిబంధనలు పాటించాలి. స్పీడ్ బ్రేకర్ల వద్ద, మూల మలుపుల వద్ద, టర్నింగ్ పాయింట్లు, సైడ్ తీసుకుంటున్న సమయంలో ఇండికేటర్‌లను తప్పనిసరిగా వినియోగించాలి. రాత్రిపూట లైట్స్ లేకుండా వాహనాలను నడపవద్దు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలి

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

చిగురుమామిడి,జనవరి 1: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక కృషి చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేకొండలోని హాళిక్ శ్రమజీవి కోఆపరేటివ్ సొసైటీలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా సీపీఐ బలోపేతం అవుతుందన్నారు. కేంద్రంలోని బీజేపీ పార్టీని గద్దె దించడమే సీపీఐ ఏకైక లక్ష్యం అన్నారు. మతం, కులం పేరుతో పనిచేస్తున్న బీజేపీకి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడితే ఏ పార్టీని సహించేది లేదన్నారు.

ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె స్వామి, ఎంపిటిసి అందె స్వప్న-స్వామి, సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, సొసైటీ చైర్మన్ మండల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

వెల్గటూర్, జనవరి 1: మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన భూపెల్లి పోచమ్మ (64) అనే మహిళ సోమవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు పోచమ్మ సంవత్సర కాలంగా గొంతు క్యాన్సర్‌తో బాధ పడుతోంది. వ్యాధి నివారణకు చికిత్స నిమిత్తం ప్రతి రెండు రోజులకు ఒకసారి కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి కీమో థెరపీ చేయించుకునేది. నాలుగు రోజులుగా వ్యాధి తీవ్రత పెరగడంతో భరించలేక జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. పోచమ్మ భర్త భూపెల్లి గంగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నందగిరిని కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలి


దేవాలయాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాసరాజు

గంగాధర, జనవరి1: కరీంనగర్ జిల్లాలో కొట్ల నర్సింహులపల్లిలో విశేష చారిత్రక, సాంస్కృతిక వారసత్వం కలిగిఉన్న ప్రాంతాన్ని నందగిరితో కలుపుతూ టూరిజం సర్క్యూట్‌ను ఏర్పాటు చేయాలని చరిత్ర పరిశోధన సమితి కన్వీనర్ డాక్టర్ శ్రీనివాసరాజు అన్నారు. సోమవారం కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని గంగాధర మండలం కొట్ల నర్సింహులపల్లిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంస్కృతిక వారసత్వ సంపదను కలిగి నాటి నుంచి నేటి తరానికి దిక్సూచిగా నందగిరి కోట, కొట్లనర్సింహులపల్లి వీరభద్ర దేవాలయం, నరసింహుని దేవాలయాలతో పాటు జైనుల సంపద ఉందన్నారు. క్రీ.పూర్వం 3వ శతాబ్దం నుంచి జైన, వైష్ణవ మత సామరస్యానికి వేదికగా ఎందరో రాజులు పాలించిన కేంద్రంగా విరసిల్లిందన్నారు. ఈ ప్రాంతాన్ని ప్రభుత్వం అభివృద్ధి పరుచుటకు చొరవ చూపాలన్నారు.చారిత్రాత్మక, ఆధ్యాత్మిక ప్రాంతాలైన కోటిలింగాల, బొమ్మలమ్మ గుట్ట, నందగిరి, ధర్మపురి,వేముల వాడను కలుపుతూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ విధంగా చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి ఈ ప్రాంతానికి ప్రాధాన్యతతో పాటు ఆదాయం, అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాజన్న క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

వేములవాడ, జనవరి 1: వేములవాడ రాజరాజేశ్వర క్షేత్రానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ఆంగ్ల నూతన సంవత్సరం తొలిరోజు కావడం, మేడారం సమ్మక్క సారక్క జాతర సమీపిస్తుండడం కారణంగా పెద్ద సంఖ్యలో భక్తులు వేములవాడకు తరలివచ్చారు. ఈ సందర్భంగా వారు తెల్లవారుజామునే ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారాయణ వ్రతం, బాలాత్రిపుర సుందరి దేవి ఆలయంలో కుంకుమ పూజ తదితర ఆర్జిత సేవలలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆలయ అధికారులు గర్భాలయంలోకి ప్రవేశం నిలిపివేసి లఘు దర్శనం అమలు చేశారు. సర్వదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయం లోకి ప్రవేశించిన భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకు న్నారు. అనుబంధ ఆలయమైన బద్ది పోచమ్మ ఆలయం భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఏఈవో బ్రహ్మన్నగారి శ్రీనివాస్ నేతృత్వంలో ఆలయ పర్యవేక్షకులు బి.తిరుపతి రావు, అల్లి శంకర్, పరిశీలకులు అశోక్, పవన్ తగిన ఏర్పాట్లు చేశారు. సోమవారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారని, దాదాపు 20 లక్షల మేరకు ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ ప్రాంగణం

గోదావరిఖనిలో కూలీ హత్య

కోల్‌సిటీ, జనవరి 1: గోదావరిఖని సప్తగిరికాలనీ మున్సిపల్ సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సమీపంలో ఆదివారం రాత్రి వెనచర్ల గంగాధరరావు(30) అనే కూలీ హత్యకు గురయ్యాడు. గంగాధర్‌రావు, అభితేజ అనే ఇద్దరు మద్యం సేవిస్తున్న సమయంలో గొడవ పడినట్టు తెలుస్తోంది. పరస్పరం దూషించుకోగా అభితేజ గంగాధర్‌రావు తలపై రాడ్‌తో కొట్టడంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అభితేజ 108కు సమాచారం ఇచ్చాడు. 108 సిబ్బంది వచ్చే సరికే గంగాధరరావు మృతి చెందాడు. దీంతో అభితేజ, అతని భార్య సునీత పరారయ్యారు. అభితేజ వేములవాడలో ఒక బాలుడిని కిడ్నాప్ చేసిన కేసులో నిందితుడు. పిల్లలు లేని అతడు పెంచుకునేందుకు బాలుడిని తీసుకెళ్లడంతో కేసు నమోదు అయ్యింది. మృతుడు గంగాధర్‌రావు స్వగ్రామం ఆంధ్రప్రదేశ్‌లోని తాడేపల్లిగూడెం. అతని బంధువులకు సమాచారం ఇచ్చినట్లు వన్‌టౌన్ సీఐ ప్రమోద్‌రావు పేర్కొన్నారు.

ఇస్కాన్ మందిరంలో ఘనంగా పుష్పోత్సవం

మెట్‌పల్లి రూరల్, జనవరి, 1 : మండలంలోని పెద్దపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ మందిరంలో స్వామి వారికి పుష్పోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి కన్నుల పండుగగా నిర్వహించారు. పుష్పోత్సవ కార్యక్రమానికి ముంబాయి, హైదరాబాద్, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి భక్తులు పాల్గొని స్వామి వారిని సందర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలతో రాధా కృష్ణులకు అభిషేకం చేశారు. నిర్వాహకులు శ్రీమాన్ నరహరి ప్రభుజి ప్రవచనం ఇచ్చారు. భక్తులు నృత్యాలు చేస్తూ నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.


పెద్దపూర్‌లోని ఇస్కాన్ మందిరంలో ఉత్సవమూర్తులు


కోరుట్లలో అయ్యప్పస్వామికి లక్షపుష్పార్చన

కోరుట్లలో లక్షపుష్పార్చన

కోరుట్ల : పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో నూతన సంవత్సరం పురస్కరించుకొని సోమవారం లక్ష పుష్పార్చన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఆలయంలో వేదపండితుడు పాలెపు రాంశర్మ, వినయ్ మంత్రోచ్చరణ మధ్య లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకం, అర్చన, పంచామృత అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అయ్యప్పకు లక్ష పుష్పార్చన మహోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. అయ్యప్ప అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం జరపారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప దేవాలయం గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణలతో పాటు పలువురు అయ్యప్ప స్వాములు భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు, అయ్యప్ప స్వాములకు బిక్షను అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

పత్తి అమ్మకానికి ఆన్‌లైన్ చిక్కులు

● వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం
● రైతులకు తప్పని అవస్థలు

జమ్మికుంట, జనవరి 1: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో పత్తి అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు ఆన్‌లైన్ చిక్కులు తప్పడం లేదు. వ్యవసాయ శాఖ అధికారులు పత్తి పంటల వివరాలు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. పత్తి అమ్ముకునేందుకు కొనుగోలు కేంద్రాలకు వస్తున్న రైతులకు తమ పేర్లు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదు. పేరు కనిపించినా, పంట విస్తీర్ణం తక్కువగా నమోదై ఉంటుంది. దీంతో తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. కనీస మద్దతు ధర దక్కడం లేదని రైతులు వాపోతున్నారు.

సీసీఐ ద్వారా ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తి సేకరణ

ఎకరాకు 12 క్వింటాళ్ల పత్తిని మాత్రమే రైతుల నుంచి సీసీఐ సేకరిస్తోంది. అంతకు మించి అదనంగా క్వింటాల్ పత్తి కూడా సదరు రైతు సీసీఐకి విక్రయించుకునే పరిస్థితి లేదు. తక్కువ పంట విస్తీర్ణం నమోదైన రైతులు ఇతర రైతుల పేరు మీద అమ్ముకునే వెసులు బాటు ఉంది. ఆ రైతు తన పంటను మళ్లీ సీసీఐకి విక్రయించుకునే అవకాశం ఉండదు. మళ్లీ ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.


జమ్మికుంట మార్కెట్‌కు వచ్చిన పత్తి వాహనాలు

అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

సుల్తానాబాద్, జనవరి1: సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట గ్రామంలో చుక్క రాజు (31) అనే రైతు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేగడి మద్దికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజు సోమవారం ఉదయం తన పొలానికి నీరు పెట్టడం కోసం ఇంటి నుంచి వెళ్లాడు. ఆలస్యమైనా ఇంటికి రాకపోవడంతో ఆయన ఆచూకీ కోసం చూడగా పొలం వద్ద మడుగులో పడి మృతి చెంది ఉన్నాడు. ఏదైనా అనారోగ్య కారణాలతో చనిపోయాడా లేక మరేదైనా కారణాలతో మృతి చెందాడో తెలియాల్సి ఉంది. ఈ మేరకు మృతుడు రాజు భార్య శైలజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.


చాకుంటలో నేలరాలిన పచ్చిమిర్చి(ఫైల్)

పంట నష్టపరిహారం వచ్చేనా?

● కొత్త ప్రభుత్వంపై ఆశలు ● వేలాది మంది రైతుల ఎదురుచూపులు

చొప్పదండి, జనవరి 1: గత ఏడాది ఏప్రిల్ చివరివారంలో కురిసిన వడగళ్ల వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ఆరుగాలం శ్రమించిన పంటకాస్త అరగంట కురిసిన వడగళ్ల వర్షం ధాటికి పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. పెట్టిన పెట్టుబడి కాస్త భూమిపాలుకాగా అన్నదాత తీవ్రంగా నష్టపోయాడు. కనీసం వరిపొలం కోసే పరిస్థితి లేకుండా తగలబెట్టుకున్నాడు. ఈ నేపథ్యంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10 వేల రూపాయలు నష్ట పరిహారం చెల్లిస్తామని ప్రకటించి, నష్టపోయిన పంట పొలాలను సర్వే చేశారు. అధికారులు పంట నష్టజాబితాను ప్రభుత్వానికి నివేదించగా ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పంట నష్టపరిహారం రైతులకు అందలేదు. మండలంలో ఏప్రిల్ చివరి వారంలో కురిసిన వడగళ్ల వర్షం ధాటికి 5,083 ఎకరాల్లో వరి, కూరగాయలతోపాటు ఇతర పంటలు పూర్తిగా ధ్వంసమైపోయాయి. చొప్పదండిలో 1,140 ఎకరాలు, వెదురుగట్టలో 1,789 ఎకరాలు, చాకుంటలో 460 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. రుక్మాపూర్‌లో 392 ఎకరాల్లో, కొలిమికుంటలో 342, చిట్యాలపల్లిలో 124, గుమ్లాపూర్‌లో 342, మొత్తం 5,083 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 6,023 మంది రైతులు పంట నష్టపోగా, పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగా రైతులు పంట నష్ట పరిహారం వస్తుందని ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చొప్పదండిలో ధ్వంసమైన వరి పంట(ఫైల్)

బెంచ్ అండ్ బార్ మధ్య సంబంధాలు కొనసాగాలి

మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

మెట్‌పల్లి, జనవరి 1: బెంచ్ అండ్ బార్ మధ్య సంబంధాలు కొనసాగినప్పుడే కేసుల పరిష్కారం త్వరగా లభిస్తుందని మెట్‌పల్లి మున్సిఫ్ కోర్టు మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. నూతన ఆంగ్ల సంవత్సర వేడుకల్లో భాగంగా బారా అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేసి శుభకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరంలో న్యాయవాదులు ప్రాక్టీస్‌లో మెళకవలు మెరుగుపరుచుకొని కేసుల పురోగతి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్, సీనియర్ న్యాయ వాదులు వడ్డేపల్లి శ్రీనివాస్, రాజ్‌మహమ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, వెంకటస్వామి, బర్ల లక్ష్మణ్, శంకర్‌రెడ్డి, హఫీజ్, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రావు, నల్ల రాజేందర్, సుధాకర్, మహేష్, శేఖర్, సాయి, కృష్ణ, జగన్ పాల్గొన్నారు.

కనుక సోమేశ్వరస్వామిని దర్శించుకున్న మెజిస్ట్రేట్లు

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రం శివారులో గల శ్రీ కనుక సోమేశ్వర స్వామిని మెట్‌పల్లి, ఖానాపూర్ మెజిస్ట్రేట్లు అరుణ్‌కుమార్, జీతిన్ కుమార్‌లు దర్శించుకున్నారు. సోమవారం ఆలయంలోని స్వామిని వారిని దర్శించుకోవడానికి వచ్చిన వారిని పురోహితులు, నాయకులు స్వాగతం పలికారు. వారు స్వామి వారికి అభిషేకాలు, అర్చన ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయాభివృద్ధి కమిటీ నాయకులు వారిని శాలువలతో సన్మానించి స్వామి వారి ప్రసాదం అందజేశారు.

సీనియర్ సిటిజన్స్ సమాజ మార్గదర్శకులు

కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటీజన్స్ సమాజ మార్గదర్శకులని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ భాష అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పలువురు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు నూతన సంవత్సరం పురస్కరించుకొని కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషను కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. జిల్లాలో సీనియర్ సిటిజన్స్ అసోసి యేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు హరి అశోక్ కుమార్, ఎండీ వకీలు, బోగ శశిధర్, విజయ్, విశ్వనాథం, హన్మంత్ రెడ్డి, యాకూబ్, ప్రకాశ్ రావు, అశోక్ రావు, దేవేందర్ రావు, ఎక్బాల్ పాల్గొన్నారు.

జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్‌లో 60 మంది పట్టివేత

ఎస్పీ సన్ ప్రీత్ సింగ్

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలు సందర్భంగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్, ఇతర తనిఖీల్లో 60 మందిని పట్టుకున్నామని ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లాలోని పలు పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా వాహన తనిఖీలు, పర్యవేక్షణ నిర్వహించామన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడం, ట్రిపుల్ డ్రైవింగ్, అతి వేగం, అజాగ్రత్తగా వాహనాలు నడిపిన పలు వాహ నాలను గుర్తించామన్నారు. తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తులకు ఆయా పోలీసు స్టేషన్లలో కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసు కుంటామని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించామని వివరించారు.

అంజన్న సేవలో అడ్లూరి, ఆది



కొండగట్టు అంజన్న ఆలయంలో అడ్లూరి లక్ష్మన్‌కుమార్

మల్యాల, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా కొండగట్టు అంజనేయస్వామిని సోమవారం ప్రభుత్వ విప్‌లు అడ్లూరి లక్ష్మన్‌కుమార్, ఆది శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన విప్‌లకు ఆలయ అధికా రులు, అర్చకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వెంకటేష్ సత్కరించగా అర్చకులు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. అనంతరం అడ్లూరి లక్ష్మన్‌కుమార్ తన నూతన వాహ నానికి స్వామి వారి సన్నిధిలో పూజలు చేశారు. వేలాదిగా భక్తులు అంజన్నను దర్శించుకొని కొత్త ఏడాదిలో అన్ని శుభాలే జరుగాలని పూజలు చేశారు.

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, జనవరి 1: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తుందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్‌లో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నూతన సంవత్సర క్యాలెండర్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ చేతులమీదుగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, సీపీఎస్ రద్దు, ఆర్థికపరమైన అంశాలతో పాటు, స్కావెంజర్‌లను నియమిస్తామని, మెగా డీఎస్సీ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం చొరవ చూపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ సంఘ బాధ్యులు భోన గిరి దేవయ్య, ప్రసాద్ రావు, నరేంధర్‌రావు, రాజశేఖర్, వెంకట రమణరావు, స్వామి, రాజేంద్రప్రసాద్, మహిపాల్ రెడ్డి, రఘునందన్ తదితరులున్నారు.

నూతన సంవత్సరంలో అందరికీ శుభం కలగాలి

జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్



విద్యార్థినులకు కేక్ తినిపిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరంలో అందరికీ శుభం కలగాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జడ్పీ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

15 మందిపై కేసు నమోదు

కోరుట్ల, జనవరి 1 : నూతన సంవ్సతరం పురస్కరించుకుని ఆదివారం రాత్రి పోలీసులు భారీ బందోబస్తును నిర్వహించారు. కోరుట్ల సీఐ ప్రవీన్ కుమార్ ఆధ్వర్యంలో కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్ తన సిబ్బందితో వాహనాల తనిఖీని నిర్వహించారు. పట్టణంలోని నందీ, కార్గిల్ చౌరాస్తాలతో పాటు వివిధ ప్రాంతాలలో పోలీసులు వాహనాల తనిఖీ చేయగా 15 మంది మద్యం సేవించి వాహనం నడిపినట్లు పోలీసులు గుర్తించారు. 15 వాహనాలు స్వాధీనం చేసుకుని సరియైన ధృవీకరణ ప్రతాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారి వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలిచినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. వారిపై కేసులు నమోదు చేశామన్నారు.

అంబరాన్నంటిన నూతన సంవత్సర సంబరాలు

ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



దర్మపురి నరసింహ స్వామి ఆలయంలో క్యూలైన్‌లో భక్తులు

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేసి ఈ యేడు ప్రతి ఒక్కరికీ సుఖ సంతోషాలను ఇవ్వాలని వేడుకున్నారు. పట్టణంలోని ఇందిరా భవన్‌లో నూతన సంవత్సరం పురస్కరించుకొని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లకు సోమవారం శుభాకాంక్షలు వెల్లువలా వచ్చాయి. పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు తరలివచ్చి అభినందనలు తెలిపారు. జిల్లా రారైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు నూనె శ్రీనివాస్, నాయకులు దువ్వ రాజు, రమేశ్ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

● జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు సోమవారం అభినందల వెల్లువ కొనసాగింది. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ను పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుప్పాల శ్రీధర్, ఎస్సీ, మైనార్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు లక్ష్మీ నారాయణ, సాయిబాబా పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండలంలో నూతన సంవత్సర ఆరంభ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అనేక మంది యువకులు, యువతులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, కుల సంఘాల సభ్యులు, కుటుంబ సభ్యులు రాత్రి వేళలో కేక్ కట్ చేసి 2023వ సంవత్సరానికి వీడ్కోలు పలికారు. అలాగే ఉదయం వేళలో అధిక సంఖ్యలో విద్యార్థులు తమ విద్యా సంస్థల్లో కేక్‌లు కట్ చేసి పంపిణీ చేసుకున్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సీఐ రమణ మూర్తి ఆధ్వర్యంలో ఎస్ఐ దత్తాత్రి, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

నరసింహుని ఆలయంలో పెరిగిన రద్దీ

ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో సోమవారం భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు స్వామి వారలను దర్శించుకున్నారు. సంవత్సరం అంతా క్షేమంగా గడవాలని కోరుతూ స్వామి వారలను భక్తి శ్రద్ధలతో పూజించారు. అంతకు ముందు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్ఛరణల మధ్య స్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది తగు సేవలు అందించారు. ధర్మపురి మున్సిపల్ వైస్ చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

భీమారం: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని చర్చిలో తెలంగాణ కాంగ్రెస్ గల్ఫ్ విభాగం అధ్యక్షుడు సింగిరెడ్డి నరేష్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ సోదరుల మౌలిక వసతుల సదుపాయాల కోసం తనవంతుగా రూ.5 వేలు అందించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కోరుట్లలో...

కోరుట్ల: నూతన సంవత్సర వేడుకలను పట్టణ ప్రజలు ఘనంగా నిర్వహించారుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని అయ్యప్ప, వెంకటేశ్వర, అష్టలక్ష్మి దేవాలయాలతో పాటు పలు ఆలయాలలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న భక్తులు నూతన సంవత్సరంలో మంచి జరగాలని మొక్కుకున్నారు. అయ్యప్ప ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కోరుట్ల రూరల్ : మండలంలోని అన్ని గ్రామాలలో నూతన సంవత్సర వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామాలలోని దేవాలయాలలో ప్రత్యేక పూజలలో పాల్గొన్న గ్రామస్థులు నూతన సంవ త్సరానికి స్వాగతం పలికారు.

కథలాపూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ పంచాయతీ ఆవరణల్లో సర్పంచులు, ఎంపీటీసీలు కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. ఆలయాల్లో పలువురు పూజలు చేశారు. భూషణరావుపేట చర్చిలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సింగిల్ విండో చైర్మన్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు సుజిత్‌రావు సతి సమేతంగా పాల్గొని మొగిలిపేట గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆయా సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని వివిధ గ్రామాలలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలలో యువకులు డీజే సౌండ్స్‌కు నృత్యాలు చేస్తూ హుషారుగా గడిపా రు. చిన్నలు, పెద్దలు నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఉదయమే ముంగిళ్లను శుభ్రం చేసి, కల్లాపి చల్లి యువతులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపే విధంగా అందమైన ముగ్గులు వేశారు. ఆలయాలు కిటకిటలాడాయి.

ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీ సుధా రామస్వామి, మాజీ ఎంపీపీలు శ్రీనివాస్‌రావు, దొరిశెట్టి వెంకట య్య, పీఏసీఎస్ చైర్మన్‌లు రాంరెడ్డి, రత్నాకర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం సోమ వారం కావడంతో కోటిలింగాల శ్రీ కోటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు.

పెగడపల్లి: పెగడపల్లి మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా చర్చిలలో కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నార్సింహుని పేటలోని వాయిస్ ఆఫ్ లవ్ చర్చిలో పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో చర్చి పాస్టర్లు ఎజ్రా మల్లేశం, ప్రకాశ్, సర్పంచ్ బాబు స్వామి పాల్గొన్నారు.



విప్, ఎమ్మెల్సీలకు గ్రీటింగ్ కార్డులు అందిస్తున్న విద్యార్థులు



భూషణరావుపేటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



కోటిలింగాలలో పూజలు చేస్తున్న భక్తులు



పెగడపల్లి చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవ సోదరులు

గడప గడపకూ శ్రీరాముని అక్షింతలు

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): గడప గడపకూ శ్రీరాముని అక్షింతలు అందిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. అయోధ్యలోని శ్రీ రాముల వారు పూజలు అందుకున్న అక్షింతలు జగిత్యాలకు చేరుకోగా సోమవా రం పట్టణంలోని అష్టలక్ష్మీ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్షింతలను నెత్తిన పెట్టుకొని గడప గడపకూ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు కాలనీల్లో ఇంటింటికి వెళ్లి అక్షింతలు అందించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్ గుగ్గిళ్ల హరీశ్, బీఆర్ఎస్ నాయకులు అవారి గంగాధర్, గంప వేణు, అనిల్, నిర్వాహకులు అశోక్‌రావు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



అక్షింతలు నెత్తిన పెట్టుకొని యాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో అయోధ్య రామ జన్మ భూమి నుంచి వచ్చిన అక్షింతలతో సోమవారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు. రామనామాన్ని జపిస్తూ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. శ్రీరామ తీర్థ క్షేత్ర సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలో పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు శ్రీరామ భక్తులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని వీరాపూర్‌లో శ్రీరాములవారి అక్షింతలను శోభాయాత్ర నిర్వహించారు. అల్లీపూర్ గ్రామంలో అక్షింతలను ఇంటింటికీ వెళ్లి పంచి పెట్టారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు. కట్కాపూర్ గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఊరేగింపు నిర్వహించారు.

మల్యాల: అయోధ్య రాముని అక్షింతలను మల్యాల మండల కేంద్రంలో ఇంటింటికీ అందజేశారు. అక్షింతలతో శోభయాత్ర నిర్వహిస్తూ అక్షింతలను భక్తులకు పంపిణీ చేశారు. అలాగే రామన్నపేట తదితర గ్రామాల్లో అక్షింతలను ఊ రేగించారు. ఆయా గ్రామాల్లో చిన్నారుల నృత్యాలు, రామనామ సంకీర్తనలతో అక్షింతలను తీసుకెళ్లారు

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాలతో పాటుగా, మండల కేంద్రంలో సోమవారం శ్రీ రామ జన్మ భూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుండి వచ్చిన అయోధ్య రామ అక్షింతల శోభయాత్ర కరసేవకులు, గ్రామ ప్రముఖులు వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయం నుంచి బస్టాండ్ మేన్ రోడ్డు గుండా అంగడి బజారు వరకు పలు దుకాణాలలో అక్షింతలను స్వయం సేవకులు పంపిణీ చేశారు. శోభయాత్రకు మహిళలు అడుగడుగన మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచు మమతనర్సింహ రెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు రాజేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, గ్రామ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు స్వయం సేవకులు పాల్గొన్నారు.

పెగడపల్లి: పెగడపల్లి మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాములోరి అక్షింతలకు భజన కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి పంపిణీ చేశారు. అయోధ్యలో నూతనంగా నిర్మిస్తున్న రామ మందిరంలో ఈ నెల 22న విగ్రహ ప్రతిష్ట నిర్వమించనుండగా రామజన్మ తీర్థక్షేత్ర ద్వారా ఊరూరా ఇంటింటికి అక్షింతల పంపిణీ కార్యక్రమంలో బాగం గా సోమవారం ఆలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అక్షింతలు పంపినీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ భూమాడి గం గారెడ్డి, పోచయ్య, వెంకటేశం, విశ్వహిందూ పరిషత్ సభ్యులు జడల రాజేశం, పార్థసారథి, సేదరి రాము లు, రాజేశం, కొమురెల్లి, నర్సింహరెడ్డి, వెంకట్ రాజం, కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వీరాపూర్‌లో అక్షింతలతో శోభాయాత్ర..



మల్యాలలో భక్తులకు అక్షింతలు అందిస్తూ..



అక్షింతలను ఊరేగిస్తున్న సర్పంచు దంపతులు

ఘనంగా అయ్యప్ప స్వామి పడిపూజ

మల్లాపూర్, జనవరి, 1 : మండల కేంద్రంతో పాటు కొత్తధాంరాజుపల్లి గ్రామాల్లో అయ్యప్ప దీక్ష పరులు, భక్తులు అయ్యప్ప స్వామి పడి పూజను నిర్వహించారు. సోమవారం ఆయా గ్రామాల్లోని భక్తులు పడి పూజ కార్యక్రమంలో భాగంగా గణపతి, కలశ, నవగ్రహ, గౌరి తదితర పూజలను గురుస్వాములు జరిపారు. 18 మెట్లకు పూజను నిర్వహించి జ్యోతిని వెలిగించారు.

గొల్లపల్లి : మండలంలోని చిల్వాకోడూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో సోమవారం సామూహిక అయ్యప్ప దీక్ష స్వాముల భక్త బృందం ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. అంతకుముందు గ్రామంలో ఉత్సవ మూర్తుల శోభాయాత్ర నిర్వహించారు. గురు స్వాములు నీలం దశరథరెడ్డి, పొలాస గురు స్వామి కొండయ్య, గండె వేణు, గందం పరంధాములు, అల్లాడి వెంకన్నల పర్యవేక్షణలో స్వామికి పూజలు చేశారు. జగిత్యాల విశ్రాంత హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య చేసిన నృసింహ స్వామి వేశధారణ, పోత లింగన్న నృత్యాలు, ఆకట్టుకున్నాయి. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ కటారి చంద్రశేఖర్ రావు, ఆలయ చైర్మన్ దాసరి తిరుపతి పాల్గొన్నారు.



గొల్లపల్లి మండలంలో పడిపూజ చేస్తున్న గురుస్వాములు

మల్యాల: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ ఏడవ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం అరట్టు ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి పురవీధుల్లో ఊరేగించారు. సోమవారం రాత్రి పడి పూజోత్సవం వైభవంగా జరిపారు. గురుస్వామి మిట్టపెల్లి లక్ష్మీనారాయణ, సర్పంచ్ సుదర్శన్ పాల్గొన్నారు.



మల్లాపూర్‌లో పడిపూజ చేస్తున్న స్వాములు



మల్యాలలో అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తుల ఊరేగింపు

యాదవ సంఘం కార్యవర్గం ఏర్పాటు

రాయికల్, జనవరి 1: రాయికల్ మండలంలోని కట్కాపూర్ గ్రామంలో శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా మాదం సతీష్, ఉపాధ్యక్షునిగా అమ్ముల రాజేందర్ ఎన్నిక కాగా, కోశాధికారిగా కాశవేని రాజేం దర్, సలహాదారుడిగా సింగవేని రామస్వామిలు ఎన్నికయ్యారు. అలాగే కార్యవర్గ సభ్యులుగా మాధవ్, కొముర య్య, మహేష్, రాజులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి యాదవుల అభివృద్ధి కోసం అనునిత్యం పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో మాదం మల్లేష్, అమ్ముల మహేష్, బండి నాగరాజు, లచ్చన్న, మ ల్లయ్య, మహేష్, సిద్ధు, తిరుపతి, పోచమల్లు పాల్గొన్నారు.

జడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన నాయకులు

కథలాపూర్, జనవరి 1: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంతను సోమవారం జిల్లా కేంద్రంలో జడ్పీటీసీ నాగం భూమయ్య కలిసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో సకల శుభాలు కలగాలని ఆకాంక్షించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

చెన్నూర్ ఎమ్మెల్యేను సన్మానించిన జువ్వాడి

కోరుట్ల, జనవరి 1 : చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌ను సోమవారం కోరుట్ల కాంగ్రెస్ నియోజవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు మార్యదపూర్వకంగా కలిసారు. హైదరాబాదులోని వివేక్ ఇంట్లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి పూల మాలలు శాలువాలతో సత్కరించారు. వివేక్‌తో పలు విషయాలపై చర్చించినట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

బుగ్గారం జనవరి 1: మండల కేంద్రానికి చెందిన కప్పల సంతోష్, తండ్రి కప్పల పోశన్న కొన్నేళ్లుగా అనారోగ్య సమస్యలతో భాదపడుతూ మంచానికే పరమితమైన కుటుంబానికి సంతోష్ పదో తరగతి మిత్రులంతా కలిసి 33 వేల రూపాలయలను, సామాజిక సేవకుడు బారతపు గంగాధర్, 2500 రూపాయలను నూతన సంవత్సరం సందర్భంగా అందజేశారు. తన మిత్రులు మాట్లాడుతూ ఈ పేద కుటుంబానికి దాతలు ముందుకు వచ్చి ఆసరగా నిలవాలని కోరారు. పోలంపేల్లి తిరుపతి, రాజేందర్, నరేష్ పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

బీర్‌పూర్, జనవరి 1: మండల కేంద్రానికి చెందిన మంత్రి రాజేందర్‌తో పాటు మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు అయినట్లు ఎస్సై గౌతమ్ తెలిపారు. కొన్ని నెలల క్రితం బీర్‌పూర్ గ్రామానికి చెందిన బండారి విక్రమ్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని తన అక్కయ్యను దళితుడు పెళ్లి చేసుకున్నాడనే కక్షతో సోమవారం మధ్యాహ్నం తుంగూర్ గ్రామంలో యువతి సోదరుడు రాజేందర్, బాబాయి నరేష్, మరొక వ్యక్తి కలిసి విక్రమ్‌ను పట్టుకుని కులం పేరుతో దూషిస్తూ దాడికి పాల్పడ్డారు. బాధితుడు విక్రమ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఎస్‌పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా లింబాద్రి

మెట్‌పల్లి, జనవరి, 1 : బహుజన్ సమాజ్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మెట్‌పల్లి పట్టణానికి చెందిన న్యాయవాదుల అధ్యక్షుడు పుప్పాల లింబాద్రిని నియ మించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పత్రాన్ని అందజేశారు. సోమవారం లింబాద్రి మాట్లాడుతూ ప్రధాన కార్యదర్శితో పాటు ఉత్తర తెలంగాణ పార్లమెంట్ నియోజవర్గాల సభ్యునిగా నియమించినందుకు పార్టీ అభివృద్ధికి అందరి సహకారంతో నిరంతరం కృషి చేస్తాన్నారు. జరగబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించడానికి ప్రతి ఒక్కరు సైనికుల కృషి చేయాలన్నారు. ఈయన ఎన్నిక పట్ల నాయకులు, హర్షం వ్యక్తం చేశారు.